
# అంగలూరు స్వాతంత్ర్యసంగ్రామ యోధుల సంక్షిప్త చరిత్ర





శ్రీ ఆరెకపూడి నాగభూషణం ఉషామణి దంపతులు

# Angaluru Heritage

A personal view point

By Premchand Bapu Arekapudi, M.D.,
Chicago, Illinois, U.S.A.



I feel privileged and proud to write from my childhood recollections in Angaluru on this extraordinary event of one-hundredth birth anniversary of my uncle Sri. Arekapudi Nagabhushanam. He not only is freedom fighter but also a wise man and independent thinker. His legacy and experiences would be of immense interest to any social activist looking for positive changes in our world.

I lived in Angaluru until I was sixteen. Later, during my college years in Guntur I have frequently visited Angaluru. This was a very important time of evolution of my social thoughts inspired by the Gandhian heritage of my father's side of family. When Mahatma Gandhi was fast becoming the greatest leader of humanity, peace and truth, my uncle Mr.Nagabhushanam (eldest of son of Brahmaih) and his elder sister Kausalya lead the mass movements in Angaluru area. I was very fascinated by the heroic but non-violent struggles of my uncles and aunts. However, I should admit that I had studied little about Gandhiji until I was in high school. The stories of the freedom struggle inspired me to think and study the autobiography of Mahatma Gandhi ( My experiments with truth ). While in high school and in 8th grade I took to wearing only Khadi, became somewhat dogmatic Gandhian,and spent substantial time in arguing for Gandhiji, Swami Vivekananda and the Arya Samaj. Observing the life of my uncle Nagabhushanam and the hopeless situation in Indian development has influenced me think

more critically by the time I was in P.U.C (12th grade). By 12th grade, I had relinquished dogmatism in favor of rationalism. To some extent, this was the consequence of my interactions with Gora, Lavanam, President Rajendra Prasad and Vinoba Bhave during the All India Sarvodaya Meetings. Then I realized that people of India moved with Gandhiji not just because they liked his ideas, but because he practiced what he preached. He had given up all the material possessions in the quest for finding the truth and as he found it. I believe my uncle Nagabhushanam had followed Gandhiji for the same reason and he was somewhat unimpressed by the latter leaders of Congress and remained with the groups he felt were more honest. We may not find leaders comparable Gandhiji in a millennium but if we were to make India a more developed, strong and truly independent country we still need Gandhiji, Mr. Nagabhushnam and the like. While Mother Theresa is a great religious benefactor of people only like people Gandhiji can lead India's secular state to glory. The benefit of living with the family of freedom fighters lead by my uncle Mr.Nagabhushanam has positively contributed to my thoughts and actions in the latter years. During my high school years, I had the privilege of studying Hindi under the tutelage of my uncle at his house, and I remember him as a very rationalistic and pragmatic man. He always had a sense of contentment and confidence, which I am sure gave him a peaceful long life. He was a natural leader and possibly had some early dogmatic approaches that prevented him (like others in his siblings) from studying English. All of his brothers and sisters studied Hindi, but never cared to go to English Schools. For Indians it was a thought of below the dignity to study English and to work for British as clerical staff. It was also not the custom of an average peasant's family to send the kids to towns to study in High Schools. However, Mr.Bramhaiah (Nagabhushanam's father) was very charitable in

helping Kaviraju Tripuraneni Ramaswamy Chowdari when he was in England studying law. Mr.Bramhaiah was also a popular "lawyer" in the village who would provide free legal advise to people. He never was formally educated as a lawyer, I was told.

My passion about Angaluru is distinctly related to my family's involvement in freedom struggle and the rational arguments made by Kaviraju (Ramaswamy Chowdary) in his writings. I was always very curious about the origination of 'Arekapudi', but my elders were unable to give me a conclusive answer. They were also not sure if they lived anywhere else other than Angaluru. I read a small book in my childhood on Angaluru that that said the village has existed since 12th century from the time of Ganapathi Deva. It was called Angaluru because there were "Angallu" (shops) for the soldiers passing by. People like Mr.Nagabhushanam and Kaviraju Ramaswami Choudary have made Angaluru a distinctive and special place. I learnt from the Arekapudi family that the content of character is the most essential element in life. My uncle is a living example of an extraordinary character who understood the truth as well as Gandhiji did without going to college or England.

It gives me great pleasure in sending best wishes on this very special occasion of the centennial celebration of this living legend of Angaluru. I gratefully acknowledge all the great education (formal and informal) I have received from this practical, highly rational human being. It is indeed a proud moment for all the people of Angaluru.

I am not sure how many in Angaluru can access World Wide Web (Internet). I expect information in this regard or any other information of interest to people of Angaluru would be posted to the web site www.Angaluru.com.

# ముందుమాట

'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ' యని మన జన్మభూమి భారతి దాస్యశృంఖలాలను త్రెంచి స్వతంత్ర భారతికి అలంకారాలు దిద్ది అమ్మరూపు ఎలా వుంటుందో ఊహించుకుంటూ, యీ సస్యశ్యామల ధాత్రిని పునీతంచేయాలనీ, మత్తులో పరాయత్త చిత్తం పెత్తనంలో జోగుతూ తూగుతూ బాధపడుతున్న పీడిత భారతావనికి జాగృతిని ప్రసాదించి యీజనజీవన స్రవంతిని సురక్షితం, సుభిక్షం, సుగమనంచేయాలని ఆశించిన మన పెద్దలు ' లాల్, బాల్, పాల్ 'లు మహాత్మాగాంధీ, జవహర్, పటేల్, జయప్రకాష్, రాజాజీ. ఆంధ్రకేసరి వంటి ఉద్దండ నాయకాగ్రేసరులు, నేతాజీ, అజాద్, భగత్‌సింగ్, మదన్‌లాల్, దింప్రూ, అల్లూరి వంటి విప్లవ యోధులు ఎందరో, ఎందరెందరో మహానుభావుల వ్యూహాత్మక, ఆచరణాత్మక కృషి ఫలితమే మన 1947 ఆగష్టు 15 నాటి స్వాతంత్ర్యలక్ష్మీదర్శనం. మనం మరచిన, చరిత్రకు దొరకని యింతెందరిమహానుభావులత్యాగ ఫలమో యీ స్వతంత్రభారతి. ఇనుపసంకెళ్ళు తెంచి పుత్తడిగాజులు తొడిగి అలంకరించినదిగ గాంధీ, నేతాజీ, జవహరులైతే నొసట కాశ్మీర తిలకం దిద్ది అలంకరించిన అమ్మను చేసి హైద్రాబాద్ లాంటి ముద్దు బిడ్డలకు పురుడుపోసిన పటేల్‌బాబులు. యీనాటికీ ఏనాటికీ మరువరాని, మరపురాని మహావీరులు, త్యాగధనులు గదా ! ఆహా ! భారతమ్మా, నీబిడ్డలెంతటి గొప్పవారమ్మా ! తుహిన గిరిశిఖరాలనంటిన నీబిడ్డల ఘనత పొగడ ఆదిశేషునికి సాధ్యమా తల్లీ !

అంతటి మహనీయుడుకాకున్నా, వారి అడుగుజాడల్లో నడిచి వారికి వీరహనుమానుడై, రామదాసై, అమ్మసేవలో పునీతమై, 'శ్రీరామచంద్రునికి ఉడుత' సాయంలా తమవంతు కర్తవ్యాన్ని ఆచరించి, బాధలుపడి, జైళ్లకెళ్లి, మనవూరికి, మనవారికి ఆదర్శప్రాయుడై, మనందరకు ప్రాతః స్మరణీయుడైన మహామనిషి శ్రీ ఆరెకపూడి నాగభూషణంగారికి జరుగుచున్న యీనాటి సన్మానికి యీ రెండు మాటలు ముందుగా చెప్పే అదృష్టం నాకు దక్కడం స్వాతంత్ర్యం కోసం నేనూ పోరాడితినా? అన్న ఆనందాన్ని కలుగజేస్తున్నాయి. ఇది నాకొక్కడికే గాదు మన యూరికే గర్వకారణం.

శ్రీ నాగభూషణం గారొక్కరే గాకుండా వారింటిలో ఎల్లరూ యీకృషిలో భాగస్వాములవ్వడం, యీ యూరి చరిత్రపుటల్లో యేబది మువ్వురు (కొసరాజు సత్యంగారితో కలిపి) అట్టివీరులుండడం అంగలూరును పునీతంచేశాయి. అందుకేయీఊరు పోతుగడ్డ.

'తాతలనాడు నేతులుతాగాం' మామూతుల వాసనచూడమనే దిశకు మనమిప్పడు చేరుకున్నందుకు సిగ్గుపడుతూ, లెంపలేసుకొని, తప్పదిద్దుకొని చేసే యీ చిన్నప్రయత్నమే, శతవసంత పూర్ణజీవిశ్రీఆరెకపూడి వారికి గ్రామప్రజల సన్మానం.

సర్వులూ యీపనికిహర్షామోదాలంద జేస్తారని ఆశిస్తూ

సదా మీసేవలో

శ్రీ దుగ్గిరాల శ్రీశైల మల్లిఖార్జునరావు

# అంగలూరు స్వాతంత్ర్యసంగ్రామ యోధుల సంక్షిప్త చరిత్ర

కృష్ణాజిల్లా అంగలూరు గ్రామము విద్యలకు, కళలకు, పసిడిపంటలకు కాణాచియై జిల్లాకాదర్శప్రాయమై వర్ధిల్లునట్టిది. ఈగ్రామము వితరణ శీలురకు, విమర్శకులకు, కవిరాజులకు, బౌద్ధవాఙ్మయ బ్రహ్మలకు పుట్టినిల్లు. విద్యా వివేక వినయ సంపన్నులయిన మహనీయులనెందరినో కన్నదీపుణ్యభూమి. ఒకనాడు ఎంతో ఔన్నత్యముగల ఈవూరు షుమారుగా యేబదియేడు మంది స్వాతంత్ర్య సమరయోధులను ప్రసాదించినదీ పుణ్యస్థలి.

అట్టి స్వాతంత్ర్యసమరయోధులలో పాతతరానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్యసమరయోధుడు శ్రీ అరెకపూడి నాగభూషణం గారు. వారు శతవసంతాలు పూర్తిగావించుకున్న ఈశుభతరుణాన గ్రామప్రజలెల్లరుఏకకంఠంగా తీర్మానించి ఏకోన్ముఖంగా కార్యక్రమాలు కొనసాగించి, నేతాజీ సుభాస్ చంద్రబోసు జన్మదినమైన ఇరువది మూడు జనవరి 2001న పెద్దలందరి సమక్షమున గ్రామ ప్రజల జేజేలతో సవినయంగా సన్మానించడం జరుగుచున్నది.

ఈ సన్మానానికి నిరాడంబరుడు వినయశీలి, మడమతిప్పని స్వాతంత్ర్యసంగ్రామ రంగవీరుడు శ్రీ నాగభూషణంగారు తగినట్టివాడే, పవిత్రమైన యీరోజున ఈ ఊరి స్వాతంత్ర్యసంగ్రామ వీరసైనికులనందరిని స్మరించుకోవడం,అవశ్యకవిధిగాయెంచికృష్ణాజిల్లా స్వాతంత్ర్యసమరయోధుల జీవితచరిత్ర నుంచి సంగ్రహముగా వారి చరిత్రలను ఈ క్రింది పొందుపరచబడుచున్నవి.

# అంగలూరుగ్రామ స్వాతంత్ర్యసంగ్రామ సమరయోధుల సంక్షిప్త చరిత్ర



## 1. శ్రీ ఆరెకపూడి నాగభూషణంగారు

జననీ జనకులు మాణిక్యమ్మ, బ్రహ్మయ్యలు,

జననం జనవరి1901 - అంగలూరు.

విద్యాభ్యాసము కేవలం నాల్గవ తరగతి, అంగలూరు గ్రామములోనే ఈ ప్రాధమికవిద్య, స్వాతంత్ర్యసంగ్రామ ఉద్యమాల కారణంగానే విద్యకు అంతరాయం, గాంధీజీ హిందీ విద్యావ్యాప్తి ప్రచారంలో భాగంగా ఉద్యమకాలంలో "హిందీ ప్రచారక్" గా రూపొందారు.

గాంధీజీ నేతృత్వము వహించిన 1920 నుండి స్వాతంత్ర్యము సిద్ధించేదనుక గాంధీజీ అనుయాయియుడు సాధు సుబ్రహ్మణ్యం, డా॥ భోగరాజు పట్టాభిసీతారామయ్యగారు, కాశీనాధుని పూర్ణ మల్లిఖార్జునుడుగారు, వల్లభనేని రామబ్రహ్మంగారు, దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారు, మొదలైన పెద్దల సాహచర్యంతో మొక్కవోని ధైర్యంతో ఉద్యమదీప్తిని ప్రకాశింపజేశారు.

1926లో శ్రీమతి ఉషామణి గారితో వివాహము జరిగింది.

**ఉద్యోగము :** స్వాతంత్ర్యానంతరము కాంగ్రెసు అంటేనే ఉద్యోగమిస్తాము, మీరు సమరయోధులేగాన నేను కాంగ్రెసు అనే చెప్పండి, ఉద్యోగం మీ ముంగిట వుంటుంది అన్నారు. కాని

స్వాతంత్ర్యానంతరము స్వతంత్ర్యము కోసము ఏర్పాటు చేసిన జాతీయ కాంగ్రేసును రద్దుచేయువలసిందింగా గాంధీజీ ఇచ్చిన పిలుపును ఆచరణలోనికి తీసుకురాకపోవటంచేత, జయప్రకాష్ లాంటి పెద్దల మాదిరి వేరే వుద్యమాలలో ప్రవేశించారు. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియాలో చేరి, సక్రమపాలనా ప్రభుత్వాలకోసం ఉద్యమాలు కొనసాగించారు. ఆ కారణంగానేను కాంగ్రెసు వ్యక్తిని అని చెప్పడానికి అయన నిరాకరించారు. అందువలన ప్రభుత్వోద్యోగము అయనకు అందని ద్రాని పండయింది.

హిందీ ప్రచారక్‌గా గాంధీజీ అనుయాయుడుగా, హిందీ వ్యాప్తికోసం అహరహంకృషిచేశారు. ఈ విద్యావ్యాప్తిలో భాగంగానే నందిగామ తాలూకా వీరులపాడు, చేటపల్లి, చట్టన్నవరంలలో, హింది ప్రైవేటోపాధ్యాయునిగా పనిచేశారు. గుంటూరు జిల్లా సిరిపురం, కృష్ణాజిల్లా గుమ్మడిదుర్రు, గొల్లపూడిలలో వుండి హిందీ భాషను ప్రచారంచేశారు. స్వగ్రామమైన అంగలూరులో వారి వద్ద హిందీ అభ్యసించిన విద్యార్థులెందరో లెక్కకు మిక్కిలిగావున్నారు. వారివద్ద హిందీ నేర్చిన విద్యార్థులు నేటికి చాలామంది సామాన్య ఉద్యోగము మొదలు ఉన్నత ఉద్యోగం వరకు కొనసాగుతూనేవున్నారు.

**కుటుంబము :** శ్రీ నాగభూషణం ఉషామణి పుణ్యదంపతులకు నల్గురు మగ సంతానం

1. విజయకుమార్ 2. క్రాంతికుమర్
3. అజాద్‌కుమార్ 4. ఆనంద్‌కుమార్.

**పెద్దకుమారుడు :** విజయకుమార్ సాంకేతిక విద్యాశాఖలో మెకానికల్ హెడ్ ఆఫ్‌ది డిపార్టుమెంటుగా పనిచేసి పదవీ విరమణ పొందియున్నారు.

**రెండవ కుమారుడు :** ఉద్యమకాలంలో పోలీసు లాఠీ దెబ్బల పుణ్యమా అని క్రాంతికుమార్ కొంత అంగ వైకల్యంతో జన్మించారు! ఆకారణంగా ఉన్నత విద్యను పొందలేకపోయారు. ప్రస్తుతం ఇంటివద్దనేవుంటూ తల్లిదండ్రులకు కంటికిరెప్పయై ఉన్నారు.

**మూడవ కుమారుడు :** ఆజాద్ కుమార్ భారత నౌకాదళంలో కొంతకాలం పనిచేశారు ప్రస్తుతం వీరు భగవత్‌సాన్నిధ్యంలోవున్నారు.

**నాల్గవ కుమారుడు :** ఆనంద్‌కుమార్ B.E., M.Sc., (Engg) లో ఉన్నత విద్యనభ్యసించి కురుక్షేత్ర, ఇంజనీరింగు కళాశాలలో ఉపన్యాసకులుగాపనిచేశారు,సిద్దార్థ,కోనేరు లక్ష్మయ్యకళాశాలలోకూడా ఉపన్యాసకులుగా పనిచేశారు. తదుపరి కర్నాటక రాష్ట్రంనందు ధార్వాడ ఇంజనీరింగు కళాశాలలో ఎలక్ట్రానిక్స్ ప్రొఫెసరుగా పనిచేశారు, ప్రస్తుతం ఏలూరులో C.R.R.ఇంజనీరింగ్ కళాశాలయందు ప్రిన్సిపాలుగా పనిచేయుచున్నారు. దీనిని బట్టి కుటుంబం ఉద్యమక్రమశిక్షణేకాక, విద్యాక్రమశిక్షణలో కూడా కల్గి వుందని ఋజువగుచున్నది.

స్వాతంత్ర్యానంతరం హిందీ ప్రచారక్‌గా ఎక్కడెక్కడ తిరిగినా 1950 సంవత్సరానికి అంగలూరులో తిరిగి స్థిరనివాస మేర్పాటు చేసుకోవటం జరిగింది.

క్రిందనుదహరించే స్వాతంత్ర్యసమరయోధులందరూ శ్రీ నాగభూషణం దంపతులకు సమకాలికులు, సహచరులేయైనా దుగ్గిరాల రాఘవ చంద్రయ్యగారంటే వీరి కొక్కింత అభిమానం 1921వ సం॥లో జరిగిన ప్రభుత్వవ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నందుకు జిల్లామొత్తంమీద 10 మందిని అరెస్టుచేశారు. వారిని గుడివాడ సబ్ జైలులో 10రోజులుంచారు. ఈ పదిమందిలో ఒకరు శ్రీ దుగ్గిరాల రాఘవ చంద్రయ్యగారు. అంటే జిల్లానాయకులలో ఆయన స్థానాన్ని మనం ఊహించుకోవాలిమరి!

1930 సం॥లో డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్యగారి ఆదేశానుసారం మద్యపాన వ్యతిరేకోద్యమం యీప్రాంతంలో తీవ్రంగా కొనసాగింది. మద్యం మత్తు నిస్తుందనీ, మత్తులో జోగి ప్రజలు బానిసత్వాన్నించి విడుదలపొందలేరనీ, జాతినిర్వీర్యమౌతుందని, అందువల్ల మద్యాన్నిముట్టవద్దనీ, గాంధీగారి పిలుపుననుసరించి యీనా ఊరు, వాడా, ప్రచారం చేసేవారు. " కల్లుమానండోయిబాబు" అంటూ పాటలు పాడుతూ ప్రచారంచేసేవారు.

అంగలూరులో యీ ఉద్యమదళనాయకుడు కీ॥శే॥ ఆరెకపూడి కోటయ్యగారు. అంగలూరులో కల్లుగీతకు వ్యతిరేకంగా కల్లు ఉత్పత్తికాకుండేందుకుగాను తాటి గెలలనునరికి వేసేవారు. అది ప్రభుత్వాదాయానికిగండి కొట్టుటయేగాబట్టి తెల్లప్రభుత్వం తీవ్రచర్యలనే చేపట్టింది.

యీ ఉద్యమంలో కీ॥శే॥ అరెకపూడి హరివాసులుగారి సాహచర్యంకూడా శ్రీ నాగభూషణంగారికున్నది.

సాధారణంగా ప్రభుత్వవ్యతిరేక ఉద్యమాలలో ప్రజలు పాల్గొంటారంటే వారితాబేదారులైన పోలీసులు చర్యతీసి కొనక తప్పదు. పోలీసులతో వ్యవహారంమాటలాచెప్పండి. అసలే అదికోతి, పైగా కల్లుతాగింది, ఈపైన నిప్పులు తొక్కింది, అన్నచందాన వారివ్యవహారం ఉంటూండడం యీనాటికి మనం చూస్తూనే వున్నాం.

ఐతే శ్రీ అరెకపూడి నాగభూషణంగారి మాటల్లో యీ ప్రభుత్వోగులందరూ ఎంతో కొంత ఉద్యమకారులంటే సాను భూతి తోనే వుండేవారని. సాధారణంగా పోలీసులంటే ఆనాడు రాక్షసులనే ప్రజలభావన. కాని వారూ మనుషులే. వారికీ ఉద్యమంపై ప్రేమవుంది, కాని పొట్టకూటికై చేసే ఉద్యోగం వదలుకోలేరు. ఐనా కొంతమేర వీరిపై ఉదారతాభావాన్ని ప్రదర్శించడం జరిగేదంటారు.

ప్రజలందరూ స్వాతంత్ర్యోదమంలో పాల్గొనలేదు. అలాగని ఉద్యమం చేయుని వారిసహకారంలేకుండా ఉద్యమకారులు ఉద్యమాలను నడుపలేరు. ప్రజలు వారివంతు సాయాన్ని మౌనంగా చర్యలలో అందించేవారు.

తాటిగెలలు నరికి కల్లు గీత కడ్డువస్తున్న యీఉద్యమకారులను అరెస్టుచేయాలి. పోలీసువారికి వీరి-చిరునామాలు కావాలి. ప్రజలు చెప్పరు. ఆఖరుకు అంగలూరు గ్రామ మునసబుగారైన శ్రీ త్రిపురనేని పట్టాభి రామయ్యగారుకూడా వీరియిళ్ళు చూపించారుగాదు. అందుకుగాను కొంత కాలం వారి మునసుగిరే ఊడింది.

ఉద్యమాలు తీవ్రతరమైన రోజుల్లో మనవూరి నాయకులను అరెస్టు చేసేనిమిత్తం పోలీసులు తీవ్రంగా గాలించినా వీరి అచూకీ అఖరికి ప్రక్కగ్రామాలవారుగాని తెలిపేవారు కాదంటే, పాల్గొన్నా లేకున్నా ప్రజలకు యీ ఉద్యమాలమీద, ఉద్యమకారులమీద సానుభూతి ఏస్థాయిలో వుందో బోధపడుతుంది. అలాగే అధికారులకు కూడా సానుభూతే. లేకుంటే ఒక గ్రామంలో ఏబదిమందిని నిర్బంధించలేరా? సత్యాగ్రహుల్ని క్రమానుసారం పోలీసులు వెదకుతూంటే స్వచ్ఛందగానో లేక అచూకీ యిప్పించి అరెస్టయ్యేవారు.

ఈ గ్రామంనించి మద్యపాన వ్యతిరేకోద్యమంలో పాల్గొన్న ప్రముఖులు: 1) శ్రీ ఆరెకపూడి నాగభూషణంగారు 2) ఆరెకపూడి కోటయ్యగారు 3) ఆరెకపూడి హరివాసులుగారు, దుగ్గిరాల సూర్యనారాయణగారి పుత్రుడు అమర ప్రసాదరావుగారు మొ॥వారు.

ఈ ఉద్యమకారులకు 9 నెలల 15 రోజులు కారాగారవాస శిక్షవిధించబడింది. రాజమండ్రి, మద్రాసు, బళ్ళారి సెంట్రల్ జైళ్ళు మరియు అలీపురం జైలు క్యాంపులలో వీరు కఠిన శిక్షల ననుభవించారు.

విడుదల అనంతరం మోతీలాల్ నెహ్రూ నిర్యాణం సందర్భంగా బహిరంగ సభా నిర్వహణలు జరిగాయి. ఆ నిర్వహణల్లో జెండా కట్టడానికి ప్రయత్నించారనే అభియోగంపై 1931 జనవరి 26న తిరిగి 6 మాసాల జైలు శిక్షను రాజమండ్రి సెంట్రల్ జైలులో అనుభవించారు.

రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు వెళ్ళిన గాంధీగారు ఉత్తిచేతులతో తిరిగి వచ్చారు. సమావేశం విఫలమైంది. మళ్ళీ ఉద్యమాలు మొదలు.

అప్పడు శ్రీనాగభూషణంగారు విజయవాడలో హిందీ నభ్యసిస్తున్నారు.

సాధు సుబ్రహ్మణ్యంగారి అధ్వర్యంలో పామర్రు - గుడివాడ రోడ్డుకు సమీపంలో కూచికాయలపూడికి దగ్గర " గాంధీ ఆశ్రమం" నెలకొల్పబడింది. ఆ రోజుల్లో అది ఉద్యమకారుల కేంద్రంగా చరఖా కేంద్రంగా వుంటూండేది. స్వయంకృషితో ఉపాధి అక్కడి విధానం సుబ్రహ్మణ్యం గారే దాని నిర్వాహకులు.

రౌండ్ టేబుల్ సమావేశం విఫలం. ఉద్యమం మొదలు, నాగభూషణంగారు మళ్ళీ చదువుకు స్వస్తిచెప్పి ఉద్యమాల్లోకొచ్చారు. ఈ సారి సాధు సుబ్రహ్మణ్యంగారినాయకత్వం. వీరి ఆదేశానుసారం గాంధీ ఆశ్రమంలో వుంటూ ఉద్యమకారులందరూ ఒక్కరొక్కరే అరెస్టయ్యేలాచేశారు, సాధుగారి ఆదేశానుసారం తాను అరెస్టు గాకుండా దూరంగా చెట్టుక్రింద ఒంటరిగా వుండి ఉద్యమాలు నడిపి అందరూ అరెస్టయ్యాక 'సాధు' గారి ఆదేశానుసారం వీరుకూడా అరెస్టయ్యారు. 1932లో కొసరాజు సత్యంగారి సహకారంతో జెండా కట్టడానికి ప్రయత్నించి తీవ్రమైన లాఠీ దెబ్బలను తిన్నారు. అంగలూరులో ఉద్యమం చాలాతీవ్రస్థాయిలో జరిగింది. ఈ ఉద్యమకారుల నణచడానికి ఒక్క యీ వూరికే 200 మంది పోలీసు బలగం నియమించబడిందంటే యీ గ్రామం ఉద్యమాలకెంత ఊపిరిపోసిందో ఊహించండి.

జెండా కట్టిందెవరన్న ప్రశ్నకు పోలీసులకు జవాబు లేదు. 'నేనే' అనిస్వచ్ఛందంగాతెలిపిదెబ్బలు తిన్న 'వీరసైనికుడు' శ్రీనాగభూషణంగారు.

విదేశీవస్త్ర బహిష్కరణ ఉద్యమంలో కూడా వీరిపాత్ర ఉన్నది. నిత్యం జాతీయ గీతాలాపనలు, జెండాలు కట్టడాలు, ప్రభుత్వ వ్యతిరేకోద్యమాలతో వీరి జీవితం లాఠీ దెబ్బలకు బలియయ్యేది. వీరి కుటుంబమంతా కూడా తెల్లదొరతనం మనదేశాన్నివీడి సీమకు తరలేవరకూ అవిశ్రాంతంగా పోరాటాన్ని సల్పారు. ప్రస్తుతం శ్రీ నాగభూషణంగారు యీ 2001 సం॥లో శత వసంతాలను పూర్తిచేసికొని అంగలూరు గ్రామంలో ఋషీశ్వరుల్లా బ్రతుకుచున్నారు.

వీరి తండ్రి బ్రహ్మయ్య, తల్లి మాణిక్యమ్మ, సోదరీమణులు సుగుణమణి, కౌసల్య, భార్య ఉషామణి సోదరుడు రాఘవేంద్రరావు యావన్మందీ అన్ని ఉద్యమాల్లో పాల్గొని ' దేశంకోసం '. అనేక యిక్కట్లపాలయ్యారు.

**మిగిలినవారి జీవితాలు సమరయోధుల చరిత్రనుండి సంగ్రహించబడినది.**



## 2. ఆరెకపూడి ఉషామణి

నాగభూషణంగారి పత్ని. అంగలూరు 1913లో జన్మించారు. 1929లో కాంగ్రెస్‌లో చేరారు. చిన్న వయస్సులోనే 1932లో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు. విదేశ వస్త్ర విక్రయ దుకాణాల ముందు పికెటింగ్ చేయగా పోలీసుల లాఠీచార్జికి స్పృహతప్పి పడిపోయారు. రెండునెలల పికెటింగ్ అనంతరం 2-5-1932న సంవత్సరం శిక్ష విధింపబడింది. రాయవెల్లూరు, కన్ననూర్ జైళ్ళలో శిక్ష అనుభవించారు.

## 3. ఆరెకపూడి మాణిక్యమ్మ

భర్త బ్రహ్మయ్య అంగలూరు. 1870 ప్రాంతంలో జన్మించారు. 1932 శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొన్నారు. 2-5-32న ఒక సంవత్సరం కఠిన శిక్ష విధింపబడింది. వెల్లూరు, కన్ననూరు జైళ్లలో శిక్ష అనుభవించారు 1948లో కీర్తిశేషులయ్యారు.



## 4. ఆరెకపూడి సుగుణమణి

పుట్టినిల్లు గుడివాడ తాలూకా అంగలూరు. తండ్రి బ్రహ్మయ్య, తల్లి, అన్న, వదిన, అక్కలతోపాటు శాసనోల్లంఘనంలో తన 12వ ఏటనే పికెటింగ్‌లో పాల్గొన్నారు. 'చిన్నపిల్లవివెళ్ళు' అనిపోలీసు అధికారి నచ్చచెప్పినా వినకుండా ఉద్యమంలో పట్టుదలగా పాల్గొన్నారు. రెండేళ్ల కఠిన శిక్ష విధించారు. మైనరు కావడం వల్ల మద్రాసు బోస్టన్ స్కూలులో శిక్ష అనుభవించారు. ప్రస్తుతనివాసం నిజామాబాద్ జిల్లా హెగ్డోలి.

## 5. అక్కినేని లక్ష్మీ పెరుమాళ్ళు

తండ్రి పుల్లయ్య. జననం 1905 గుడివాడ తాలూకా అంగలూరు. రైతు, శాసనోల్లంఘనంలో పాల్గొని, 2-12-1930 నుంచి మూడు నెలల రెండు వారాల కఠిన శిక్షను రాజమండ్రి జైలులో అనుభవించారు.

## 6. అరెకపూడి హరివాసులు

తండ్రి సీతారామస్వామి. జన్మస్థలం గుడివాడ తాలూకా అంగలూరు. రైతు, ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. 13-5-1930న 9 నెలల కఠినశిక్ష రు. 50/- జరిమానా విధించారు. జరిమానాలో సగం వసూలు చేశారు. రాజమండ్రి, మద్రాసు, అలీపురం జైళ్లలో శిక్ష అనుభవించారు.

## 7. అరెకపూడి మహాలక్ష్మమ్మ

భర్త రామస్వామి. స్వగ్రామం గుడివాడ తాలూకా అంగలూరు శాసనోల్లంఘనోద్యమంలో 31-3-1932న గుడివాడలో విదేశ వస్త్రాలయాల ముందు పికెటింగ్ చేయగా. అరెస్టుచేసి, దూరప్రాంతానికి తీసుకెళ్ళి, వదిలివేశారు. తిరిగి 2-5-1932న పికెటింగ్ చేయగా సంవత్సరం కఠిన శిక్ష విధించారు. వెల్లూరు జైలులో శిక్ష అనుభవించారు.

## 8. అరెకపూడి కోటయ్య

తండ్రి బాపయ్య. జన్మస్థలం గుడివాడ తాలుకా అంగలూరు. రైతు, ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. 13-5-1930న 9 నెలల కఠిన శిక్ష రు. 50/- జరిమానా విధించారు. శిక్షను రాజమండ్రి, మద్రాసు, అలీపురం జైళ్లలో అనుభవించారు. జైలు నుంచి విడుదలైన వెంటనే తిరిగి శాసనోల్లంఘనంలో పాల్గొన్నారు. 11-2-1931న ఆరునెలల శిక్ష అనుభవిస్తుండగా, గాంధీ - ఇర్విన్ ఒప్పందంతో విడుదలయ్యారు.

## 9. ఆరెకపూడి రామశాస్త్రులు

తండ్రి సుందరయ్య. గుడివాడ తాలూకా అంగలూరు 1918 నుంచి జాతీయవాది. హరిజనుని పంచాయితీబోర్డు ప్రెసిడెంటుగా చేయాలని ప్రచారం చేసి గ్రామస్థుల వ్యతిరేకతకు గురిఅయ్యారు. స్కూళ్లలో హరిజన ఉపాధ్యాయులను నియమించడానికి కృషిచేశారు. 3 ఎకరాల పొలం దానమిచ్చి జాతీయ పరిశ్రమ స్థాపించారు. 1930లో సత్యాగ్రహ వాలంటీర్లను తమ గ్రామంనుండి బయటికి పంపించి వేయాలని పంచాయతీ ప్రెసిడెంటుగా ఉన్న వీరిపై కలెక్టర్ ఒత్తిడి చేశారు. గ్రామస్తులను బయటకు పొమ్మనే హక్కు తనకుగానీ, కలక్టర్‌కుగానీ లేదని జవాబిచ్చారు. గ్రామంలో సత్యాగ్రహ శిబిరాన్ని పోలీసులు తొలగించిన తర్వాత, సత్యాగ్రహులకు ఆశ్రయమిచ్చినందుకు వీరిని లాఠీచార్జిచేసి గుడివాడ సబ్ జైలులో ఉంచారు. 2 సంవత్సరాల శిక్ష విధించి బి. క్లాసు ఇచ్చారు. రాజమండ్రి జైల్లో వ్యాధిగ్రస్తులు కాగా, మద్రాసు జైలుకు మార్చి ఆస్పత్రిలో చేర్చారు. ఆరుమాసాల పిదప విడుదల చేశారు. తర్వాత కొద్దికాలానికే కీర్తిశేషులయ్యారు.



## 10. ఆరెకపూడి సుందరరామయ్య

తండ్రి వీరయ్య. గుడివాడ తాలూకా అంగలూరు. ఉప్పసత్యాగ్రహశిబిరం స్థాపించి 50 గ్రామాలలో ప్రచారం చేశారు. తాటిగెలలు నరకుట, కల్లుదుకాణాల వద్ద పికెటింగ్‌లలో పాల్గొన్నారు. 7-7-30న ఆరుమాసాల శిక్ష విధించబడింది. రాజమండ్రి, రాయవెల్లూరులలో శిక్షను అనుభవించారు.



## 11. ఎర్నేని సుబ్రహ్మణ్యం

తండ్రి గంగయ్య 1898 ప్రాంతంలో జన్మించారు. గుడివాడ తాలూకా అంగలూరు వాస్తవ్యులు సర్వోదయ నాయకుడు సాధు సుబ్రహ్మణ్యం అని ప్రజలు పిలుస్తూ ఉండేవారు, ఉప్పు సత్యాగ్రహ సమయంలో గాంధీజీ వెంట దండియాత్రలో పాల్గొన్నారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు 23-5-1930న ఒక సంవత్సరం శిక్ష విధింపబడింది.రాజమండ్రి, కోయంబత్తూరు జైళ్ళలో శిక్ష అనుభవించారు. 1931లో 6 నెలల శిక్ష విధించబడింది. శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొనగా, సంవత్సరం ఆరువారాల కఠినశిక్ష విధించబడింది, 18-1-32 నుండి రాజమండ్రి సెంట్రల్ జైల్లో శిక్షననుభవించారు. ఉద్యమ కాలంలో ఆయన ఇంటిని కూడా స్వాధీనం చేసుకున్నారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో 8 నెలల విడిఖైదు విధించబడింది. అలీపురం క్యాంపు జైలులో శిక్షననుభవించారు. కొమరలోలులో సత్యాగ్రహ ఆశ్రమం నెలకొల్పారు. 'దరిద్రనారాయణ' అనే పత్రిక నడిపారు. 1969లో శాసనసభ్యులు. 1974 సెప్టెంబరు 21న కీర్తి శేషులయ్యారు. కీ.శే. పొట్టి శ్రీరాములుగారు వీరి ప్రియశిష్యులు.



## 12. ఎర్నేని లీలావతి

తండ్రి వల్లభనేని జానకిరామయ్య భర్త సుబ్రహ్మణ్యం. స్వగ్రామం గుడివాడ తాలూకా అంగలూరు శాసనోల్లంఘనంలో పాల్గొన్నారు.

18-1-1932న సంవత్సరం జైలు శిక్ష, రు. 100/- జరిమానా విధించారు. వెల్లూరు, కన్ననూరు జైళ్లలో శిక్ష అనుభవించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 3-11-1942 నుంచి మూడునెలలశిక్షను వెల్లూరు జైలులో అనుభవించారు. తిరిగి 6-3-1943 నుంచి డి. ఐ. ఆర్. క్రింద ఆరునెలల శిక్షను వెల్లూరు జైలులో అనుభవించారు. కడసారి 19-2-1944 నుంచి 17-2-1945 వరకు సంవత్సరం శిక్షను వెల్లూరు జైలులో అనుభవించారు. హిందీ, మరాఠీ భాషలు అభ్యసించారు. వార్ధామహిళా ఆశ్రమంలో శిక్షణ పొందారు. కీర్తి శేషులయ్యారు.



## 13. ఎర్నేని అమృతమ్మ

భర్త సూర్యనారాయణ. స్వగ్రామం గుడివాడ తాలూకా అంగలూరు. తండ్రి బొప్పన వెంకటాద్రి. శాసనోల్లంఘనంలో అరెస్టు అయ్యారు.

18-1-1932న సంవత్సరం కఠిన శిక్ష రు 100/- జరిమానా విధించారు. వెల్లూరు, కన్ననూరు జైళ్ళలో శిక్ష అనుభవించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో మూడు సార్లు శిక్షలు అనుభవించారు. మొదటిసారి నెల పదిహేను రోజులు, రెండవసారి 5-2-1943 నుంచి ఆరు మాసాలు, మూడవసారి 21-8-1943 నుంచి 18 మాసాలు కఠిన శిక్షను వెల్లూరు జైలులో అనుభవించారు.



## 14. ఎర్నేని పుల్లమ్మ

తండ్రి బొప్పన నరసయ్య. భర్త రంగయ్య. స్వగ్రామం గుడివాడ తాలూకా అంగలూరు ఎనభైయేళ్ళ వయస్సులో శాసనోల్లంఘనంలో పాల్గొని, అరెస్టయ్యారు. 18-1-1932న సంవత్సరం కఠినశిక్ష, రు.100/- జరిమానా విధించారు. వెల్లూరు, కన్ననూరు, జైళ్లలో శిక్ష అనుభవించారు.

## 15. ఎర్నేని బ్రహ్మయ్య

తండ్రి పిచ్చయ్య. జన్మస్థలం గుడివాడ తాలూకా అంగలూరు. రైతు, శాసనోల్లంఘనానికి 2-7-1930న ఆరునెలల కఠినశిక్ష విధించారు. రాజమండ్రి, అలీపురం జైళ్లలో శిక్ష అనుభవించారు. విడుదలైన తరువాత తిరిగి శాసనోల్లంఘనంలో పాల్గొన్నారు. 11-2-1931న ఆరునెలలు కఠినశిక్ష విధించారు. రాజమండ్రి జైలులో శిక్ష అనుభవిస్తుండగా గాంధీ- ఇర్విన్ ఒప్పందంతో 11-3-1931న విడుదలయ్యారు.



## 16. ఎర్నేని సూర్యనారాయణ

తండ్రి గంగయ్య. గుడివాడ తాలూకా అంగలూరు వాస్తవ్యులు, రైతు, ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు 2-6-30న రెండేళ్ళ కఠిన శిక్ష విధించారు. రాజమండ్రి, బళ్లారి జైళ్లలో శిక్షను అనుభవించారు

గాంధి-ఇర్విన్ ఒడంబడిక ప్రకారం 11-3-31న విడుదలయ్యారు. తిరిగి శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని 15-6-32న ఆరునెలల శిక్షపొందారు. రాజమండ్రి జైలులో శిక్షను అనుభవించారు. క్విట్ ఇండియా ఉద్యమ సందర్భంగా 11-5-43 నుండి రెండేళ్ళ కఠిన శిక్షను అలీపురం క్యాంపు జైలులో అనుభవించారు.



## 17. గొట్టిపాటి సీతారమేశ చంద్రశేఖరరావు

తండ్రి నాగయ్య. అంగలూరు నివాసి. 1919లో జననం. 1942 క్విట్ ఇండియా వుద్యమంలో పాల్గొన్నందుకు 6-4-43 నుండి 2సంవత్సరాలు శిక్ష, రు.50 జరిమానా 10 కొరడా దెబ్బలు విధింపబడగా అలీపురం జైలులో శిక్ష అనుభవించారు.

## 18. గొట్టిపాటి వెంకటరత్నం

తండ్రి గంగయ్య. గుడివాడ తాలూకా అంగలూరు. రైతు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. 7-7-30 నుండి రాజమండ్రి, అలీపురం, జైళ్ళలో ఆరునెలల శిక్ష అనుభవించారు.

## 19. గొట్టిపాటి వెంకటరత్నం

తండ్రి రామయ్య. గుడివాడ తాలూకా అంగలూరు వాస్తవ్యులు. రైతు శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొన్నందుకు, 3 నెలల రెండువారాల కఠిన శిక్షను విధించారు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో శిక్ష ననుభవించారు.



## 20. గొట్టిపాటి శివాజీరావు

తండ్రి పెద్ద పున్నయ్య. గుడివాడ తాలూకా అంగలూరులో 1908 జూన్ 15న జన్మించారు. రైతు, ఉప్ప సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నందుకు 17-6-30న ఒక సంవత్సరం కఠినశిక్ష విధించబడింది. రాజమండ్రి, తిరుచునాపల్లి జైళ్లలో శిక్ష ననుభవించారు.

## 21. గొట్టిపాటి రమేష్‌చంద్రచౌదరి

జన్మస్థలం గుడివాడ తాలూకా అంగలూరు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని, 9 నెలల కఠినశిక్షను అనుభవించారు.

## 22. గొట్టిపాటి చిన్న పున్నయ్య

తండ్రి రామకృష్ణయ్య. జన్మస్థలం గుడివాడ తాలూకా అంగలూరు. రైతు శాసనోల్లంఘనంలో పాల్గొని, 22-12-1930 నుంచి మూడు నెలల, రెండు వారాల కఠినశిక్షను రాజమండ్రి జైలులో అనుభవించారు.

## 23. గొట్టిపాటి శ్రీరాములు

తండ్రి వెంకటరాయుడు. గుడివాడ తాలూకా అంగలూరు జన్మస్థలం. ఉప్ప సత్యాగ్రహంలో మూడు నెలల, రెండు వారాల కఠిన శిక్షను 22-12-30 నుండి రాజమండ్రి జైలులో అనుభవించారు.

## 24. టి. రామకృష్ణయ్య

జన్మస్థలం గుడివాడ తాలూకా అంగలూరు. క్విట్ ఇండియా ఉద్యమంలో రవాణా సౌకర్యాలను భగ్నం చేసిన చర్యలకుగాను డి. ఐ.ఆర్. క్రింద అరెస్టు చేసి, శిక్ష విధించారు.

## 25. చలసాని నాగభూషణం

తండ్రి హనుమయ్య. జన్మస్థలం గుడివాడ తాలూకా అంగలూరు. రైతు, ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. తీవ్రమైన లాఠీచార్జీకి గురయ్యారు. 4-6-30న సంవత్సరం కఠినశిక్ష, రు.50/ జరిమానా విధించారు. రాజమండ్రి, కోరాపుట్, బరంపురం జైళ్లలో శిక్ష అనుభవించారు. తిరిగి 1932 శాసనోల్లంఘనంలో పాల్గొన్నారు. గుడివాడ తాలూకా ఆఫీసువద్ద జరిగిన పోలీస్ లాఠీచార్జీలో స్పృహతప్పి పడిపోతే ఆయనను సైడ్ కాల్వలోకి ఈడ్చారు. ఆయన చేతి గూడు జారిపోయింది. సంవత్సరం కఠినశిక్ష, రు.100/- జరిమానా విధించారు. క్విట్ఇండియా ఉద్యమకాలంలో 6-4-1943 నుంచి సంవత్సరం ఆరుమాసాల జైలు శిక్షను అలీపురం జైలులో అనుభవించారు.

## 26. చాపరాల సుబ్బారావు



తండ్రి రామయ్య . 1917లో జననం.అంగలూరులో నివాసం. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 6-4-1943 నుండి 9 నెలలు అలీపురం జైలులో శిక్ష అనుభవించారు.

## 27. త్రిపురనేని రామకోటయ్య

తండ్రి భూషయ్య. జన్మస్థలం గుడివాడ తాలూకా అంగలూరు రైతు, ఉప్ప సత్యాగ్రహంలో పాల్గొని, 7-7-1930 నుంచి ఆరునెలల కఠినశిక్షను రాజమండ్రి , వెల్లూరు జైళ్లలో అనుభవించారు.



## 28. తిపిర్నేని వెంకాయమ్మ

ఖమ్మం జిల్లా మధిర తాలూకా అల్లీ నగరంలో జన్మించారు. వీరి అత్తవారి వూరు గుడివాడ తాలూకా అంగలూరు.తిపిర్నేని లక్ష్మీనారాయణగారి పత్నీ. 1932లో విదేశ వస్త్రాల షాపుల వద్ద పికెటింగ్ చేస్తూ కరపత్రాలు పంచిపెడుతుండగా గుత్తి సబ్‌జైలులో 15 రోజులు వుంచి విడుదల చేసారు. అప్పటికి వీరి వయసు 16 సంవత్సరాలు.

## 29.తిపిర్నేని రామశాస్త్రులు

తండ్రి రామస్వామి. జన్మస్థలం గుడివాడ తాలూకా అంగలూరు. రైతు, శాసనోల్లంఘనలో పాల్గొని 22-12-1930 నుంచి మూడున్నర నెలల కఠిన శిక్ష, రు.100/- జరిమానా విధించారు అలీపురం జైలులో శిక్ష అనుభవించారు.

## 30. తిపిర్నేని వరప్రసాదరావు

తండ్రి రామశాస్త్రులు. జన్మస్థలం గుడివాడ తాలూకా అంగలూరు. రైతు, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు.

6-4-1943 న ఆరు నెలల కఠిన శిక్ష, రు. 100/- జరిమానా విధించారు అలీపురం జైలులో శిక్ష అనుభవించారు.

## 31. త్రిపురనేని హరి ప్రసాదరావు

గుడివాడ తాలూకా అంగలూరు. తండ్రి వెంకటరత్నం. 1930-31 సంవత్సరాల్లో జాతీయోద్యమంలో శిక్షింపబడ్డారు. మొదటిసారి గుడివాడలో 6 నెలల శిక్ష, రు.25/- జరిమానా విధించబడింది. 28-7-30 నుండి రాజమండ్రి, అలీపురం జైళ్లలో శిక్షను అనుభవించారు. రెండవసారి 11-2-31 న ఆరు నెలల శిక్ష విధించబడింది. గాంధి-ఇర్విన్ ఒడంబడిక ప్రకారం 11-3-31 న విడుదలయ్యారు. కీర్తి శేషులయ్యారు.



## 32. త్రిపురనేని రాధాకృష్ణారావు

తండ్రి జానకి రామయ్య. అంగలూరు నివాసి. రైతు. తన 16వ ఏట ఫోర్తుఫారం చదువుతూ శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు.1932న 6మా॥ శిక్ష రాజమండ్రి సెంట్రల్ జైలులో అనుభవించారు. క్విట్ఇండియా ఉద్యమంలో వీరిపై 2 కేసులు పెట్టి 6-4-1943న సంవత్సరం నాలుగు నెలల కఠిన శిక్ష 10 కొరడా దెబ్బలు, రు. 50 జరిమానా విధించారు. జరిమానా వసూలు చేశారు. అలీపురం, క్యాంపు జైలులో 1సం॥ 3మా॥ వుంచి తరువాత విడుదల చేశారు. ఏడుసార్లు లాఠీఛార్జీకి గురయ్యారు.



## 33. త్రిపురనేని సుబ్రహ్మణ్యం

తండ్రి నాగయ్య. నివాసి. వీరు 1930 సంవత్సరం నుండి కాంగ్రెస్ వుద్యమాల్లో పాల్గొన్నారు. 1942 క్విట్ఇండియా ఉద్యమంలో పాల్గోన్నందుకు 6-4-1943 న సంవత్సరం కఠిన శిక్ష 10 కొరడా దెబ్బలు విధించారు. హైకోర్టులో కేసు కొట్టి వేసినందున 2-10-1943 న ఆలీపురం క్యాంపు జైలు నుంచి విడుదలయ్యారు.

## 34. తిపిర్నేని నాగభూషణం

తండ్రి వెంకట్రామయ్య. జన్మస్థలం గుడివాడ తాలూకా అంగలూరు. రైతు. ఉప్ప సత్యాగ్రహంలో పాల్గొన్నారు. 4-6-1930 న సంవత్సరం కఠిన శిక్ష రు. 50/- జరిమానా విధించారు. రాజమండ్రి, తిరుచునాపల్లి, అలీపురం జైళ్లలో శిక్ష అనుభవించారు. గాంధీ-ఇర్విన్ ఒప్పందంతో 14-3-1931న విడుదలయ్యారు. తిరిగి శాసనోల్లంఘనంలో పాల్గొన్నారు. 14-3-1932న సంవత్సరం కఠిన శిక్ష విధించారు. రాజమండ్రి జైలులో శిక్ష అనుభవించారు.

## 35. తిపిర్నేని కౌసల్య

అంగలూరు తండ్రి బ్రహ్మయ్య భర్త అంజయ్య 1930 ఉప్ప సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నారు. సంవత్సరం కఠినశిక్ష రు. 100/- జరిమానా, జరిమానా చెల్లించనిచో ఆరువారాల కఠినశిక్ష విధించారు. గుడివాడలో విదేశ వస్త్ర దుకాణాల ముందు పికెటింగ్ చేయుచుండగా పోలీసుల లాఠీచార్జీకి గురియై స్పృహతప్పిపోయారు. 1932 ఏప్రిల్ 18న సంవత్సరం కఠిన శిక్ష విధించబడింది.

ఖాధీ, హరిజనోద్యమాలలో పనిచేశారు. అంగలూరు దేవాలయంలో హరిజనులకు ప్రవేశ మివ్వాలని కోరుతూ 20 రోజులు నిరాహార వ్రతంచేశారు 1958లో కీర్తిశేషులయ్యారు.



## 36. దుగ్గిరాల వెంకటేశ్వరరావు

తండ్రి నాగయ్య. అంగలూరులో 14-3-1921న జననం. ప్రాథమికోపాధ్యాయుడిగా పని చేస్తూ క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. 4-10-42న అరెస్టు చేయబడ్డారు. అలీపురం క్యాంపు జైలులో 9 మాసాలు కఠినశిక్షను 6-4-43 నుంచి 12-4-43 వరకు అనుభవించారు. సబ్‌జైలుతో సహా మొత్తం ఒక సంవత్సరం జైలుజీవితం గడిపారు.

## 37. దుగ్గిరాల శివాజీరావు

గుడివాడ తాలూకా అంగలూరు వాస్తవ్యులు క్విట్‌ఇండియా ఉద్యమ సందర్భంగా సబ్‌జైలులో కొన్నాళ్ళుంచి రు. 400/- జరిమానా విధించారు.



## 38. దుగ్గిరాల బలరామకృష్ణయ్య

తండ్రి అమరయ్యర్య. జననం 1905 గుడివాడ తాలూకా అంగలూరు. రైతు. 1919లో ఎస్.ఎస్.ఎల్.సి. చదువుతూ, ఆంగ్ల విద్యకు స్వస్తిచెప్పి బందరు నేషనల్ కాలేజీలో చేరారు.

సంస్కృతం, హిందీ, తెలుగు సాహిత్యాలు ఔపాసన పట్టారు. గుజరాతీ, ఉర్దూ భాషలలో అనర్గళంగా ప్రసంగించగలరు. 1919లో 'గాంధీ మహోదయ' 'తిలక్ విజయ' నాటకాలు ప్రదర్శించినందుకు అరెస్టుచేశారు. మూడేళ్ళు అల్హాబాద్ హిందీ విద్యాపీఠంలో హిందీ అభ్యసించారు. 1921 లో అల్హాబాద్‌లో ప్రిన్సు ఆఫ్ వేల్స్ రాకకు నిరసనగా నల్లజెండాల ప్రదర్శనలో పాల్గొని అరెస్టు అయ్యారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. 1-7-1930 న సంవత్సరం శిక్షవిధించారు. రాజమండ్రి, వెల్లూరు జైళ్లలో శిక్ష అనుభవించారు. శాసనోల్లంఘనంలో పాల్గొని 9-10-1933 న అరెస్టు అయ్యారు. 1-11-1933న 9 నెలల కఠిన శిక్ష విధించారు. రాజమండ్రి జైలులో శిక్ష అనుభవించారు. క్విట్‌ఇండియా ఉద్యమకాలంలో 30-9-1942 నుంచి 9-12-1944 వరకు వెల్లూరు, తంజావూరు జైళ్లలో డిటెన్యూగా వున్నారు. వితంతు వివాహాలను ప్రోత్సహించారు, అంటరానితనాన్ని వ్యతిరేకించారు "బుద్ధ పురాణం" 'మానవ జీవితం' వంటి అనేక గ్రంథాలు రచించారు. గుజరాతీలో గాంధీజీ రచించిన ' అనాసక్త యోగం'ను తెలుగులోకి 'నిష్కామ యోగం' పేరుతో అనువదించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యక్షతన ఆంధ్రమహాసభ వారు " బౌద్ధవాఙ్మయ బ్రహ్మ" బిరుదును 1927లో ప్రదానం చేశారు. తూర్పు కృష్ణాజిల్లా అధ్యక్షులుగా పనిచేశారు. 8 సంవత్సరాలపాటు రాష్ట్ర కాంగ్రెసు సంయుక్త కార్యదర్శి, అయిదేళ్ళపాటు ఎ.ఐ.సిసి. సభ్యులు. ఒకసారి లోక్‌సభకు ఎనికయ్యారు.



## 39. దుగ్గిరాల కమలమ్మ

తండ్రి త్రిపురనేని జానకి రామయ్య. జననం 1910న గుడివాడ తాలూకా అంగలూరు భర్త బలరామకృష్ణయ్య శాసనసోల్లంఘనంలో పాల్గొన్నారు. 27-1-1931న నాలుగు నెలలు విడిఖైదు విధించారు. వెల్లూరు జైలులో శిక్ష అనుభవిస్తుండగా గాంధీ-ఇర్విన్ ఒప్పందం జరగడంతో విడుదలయ్యారు. తిరిగి శాస నోల్లంఘనంలో పాల్గొని 6-1-1932 నుంచి ఆరునెలల విడిఖైదును వెల్లూరు జైలులో అనుభవించారు. అంటరానితనం నిర్మూలనం, లైబ్రరీ ఉద్యమం, మహిళా మండలి మున్నగు వాటి కొరకు కృషి చేశారు.

## 40. దుగ్గిరాల వెంకట సుబ్బయ్య

తండ్రి అమరయ్య . గుడివాడ తాలూకా అంగలూరు వాస్తవ్యులు. రైతు, శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొన్నారు. 22-12-30 నుండి 3 1/2 నెలల శిక్షను రాజమండ్రి జైల్లో అనుభవించారు.



## 41. దుగ్గిరాల అమరప్రసాదరావు

తండ్రి సూర్య నారాయణ. జన్మస్థలం గుడివాడ తాలూకా అంగలూరు. రైతు. ఉప్పు సత్యాగ్రహంలో అరెస్టు అయ్యారు. ఆరు నెలల కఠినశిక్ష, రు. 50/- జరిమానా విధించారు. 13-5-1930 న రాజమండ్రి, వెల్లూరు. అలీపురం జైళ్లలో శిక్ష అనుభవించారు.

## 42. దుగ్గిరాల వరప్రసాదరావు

గుడివాడ తాలూకా అంగలూరు వాస్తవ్యులు. 1930 శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొన్నారు. 9 నెలల కఠిన శిక్ష విధించబడింది.

## 43. దుగ్గిరాల రాఘవ చంద్రయ్య ( సచ్ఛాస్త్రి )

తండ్రి పురుషోత్తం జననం 19-5-1892 గుడివాడ తాలూకా అంగలూరు. వందేమాతరం ఉద్యమంతో ఉత్తేజితులై జాతీయోద్యమంలో ప్రవేశించారు 1920-24 మధ్యకాలంలో తూర్పు కృష్ణాజిల్లా కాంగ్రెసు సంఘ సంయుక్త కార్యదర్శి. స్వగ్రామంలో "జాతీయ పరిశ్రమాలయ" స్థాపకులలో ఒకరు. 1922లో విజయవాడలో స్వరాజ్య ప్రెస్సును ఏర్పాటుచేసి " స్వరాజ్య " పత్రిక నడిపారు. 1923 కాకినాడ కాంగ్రెసు సందర్భంలో 'స్వరాజ్య' ప్రత్యేక సంచికను ప్రచురించారు. ఎ.ఐ.సి.సి. సభ్యులుగా ఎన్నికైరి. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని, 15-5-1930 నుంచి సంవత్సరం కఠినశిక్షను కన్ననూరు జైలులో అనుభవించారు బ్రాహ్మణేతరులు వేదపఠనానికి అర్హులా అన్న అంశంపై జైలులో కొందరు కాంగ్రెసు నాయకులతో విభేదాలు ఏర్పడ్డాయి. వ్యష్టి సత్యాగ్రహ కాలంలో డి.ఐ.ఆర్. క్రింద అరెస్టు అయి, 22-4-1941 నుంచి 7 నెలల కఠిన శిక్షను అలీపురం జైలులో అనుభవించారు. 1914లో "విజయనగర సామ్రాజ్యం" నవల రచించి 'విజ్ఞాన చంద్రికా మండలి' వారు నిర్వహించిన పోటీకి పంపారు. ఆ పోటీలో ఆగ్రంథానికి రు. 500/- నగదు బహుమతి, బంగారు పతకం లభించాయి. ఆంధ్ర యూనివర్శిటీ 'విజయనగర సామ్రాజ్యం' నవలను ఇంటర్

పాఠ్యాంశంగా నిర్ణయించింది ఇంకా అనేక గ్రంథాలను రచించి, రచయితగా పేరుపొందారు. 25-5-1977 న విజయవాడలో కీర్తిశేషులైరి.

## 44. దుగ్గిరాల నాగయ్య

తండ్రి పెరుమాళ్ళు, జన్మస్థలం గుడివాడ తాలూకా అంగలూరు. రైతు. శాసనోల్లంఘనంలో పాల్గొని, 22-12-1930 నుంచి మూడున్నర నెలల కఠినశిక్షను రాజమండ్రి జైలులో అనుభవించారు.



## 45. పోతరాజు రాధా మనోహరం

తండ్రి యెర్నేని సూర్యనారాయణ. భర్త వెంకట సుబ్బయ్య స్వస్థలం గుడివాడ తాలూకా అంగలూరు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని మొత్తం నాలుగు సార్లు అరెస్టు అయ్యారు మొదటిసారి 10-2-1943 నుంచి ఆరునెలల కఠిన శిక్షను వెల్లూరు జైలులో అనుభవించారు. 1944 లో రెండు దఫాలు అరెస్టుఅయి, సబ్ జైలులో రిమాండ్‌లోవున్నారు. తిరిగి 19-2-1944 డి.ఐ.ఆర్. క్రింద సంవత్సరం కఠిన శిక్ష విధించారు. వెల్లూరు జైలులో శిక్ష అనుభవించారు. హిందీ, ఖాదీ ప్రచారం పట్ల ఆసక్తి కలవారు.



## 46. బందా రామచంద్రరావు

తండ్రి వెంకయ్య. జననం 17-1-1921. గుడివాడ తాలూకా అంగలూరు. టీచరు. క్విట్ ఇండియా ఉద్యమంలో డి.ఐ.ఆర్. క్రింద అరెస్టు చేశారు. 17-5-1943న సంవత్సరం కఠిన శిక్ష విధించారు. అలీపురం జైలులో శిక్ష అనుభవించారు.



30

## 47. బొప్పన రంగారావు

తండ్రి శ్రీరాములు. జన్మస్థలం గుడివాడ తాలూకా అంగలూరు. రైతు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని, 6-4-1943 నుంచి పది నెలల కఠిన శిక్షను అలీపురం జైల్లో అనుభవించారు.

## 48. మూల్పూరి కోటేశ్వరరావు



తండ్రి దశరధ రామయ్య. జననం 1-5-1926. గుడివాడ తాలూకా అంగలూరు. పదహారేళ్ళ వయసులో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. 3-10-1942న అరెస్టు అయ్యారు. 4-4-1943 వరకు సబ్‌జైలులో నిర్బంధం. 4-4-1943న రు. 80/- జరిమానా విధించారు. ప్రస్తుత నివాసం ఆదిలాబాద్‌జిల్లా లక్సెట్టిపేట తాలూకా తానిమడుగు.

## 49. వీరమాచనేని కోటేశ్వరరావు

తండ్రి సుబ్బయ్య. జన్మస్థలం గుడివాడ తాలూకా అంగలూరు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. 6-4-1943న సంవత్సరం నాలుగు మాసాల కఠిన శిక్ష విధించారు. అలీపురం జైలులో శిక్ష అనుభవించారు. 15-5-1943న కొరడా దెబ్బల శిక్ష అమలు జరిపారు.

## 50. వీరపనేని సోమశేఖరరావు



తండ్రి సుబ్బయ్య 1923న అంగలూరులో జననం. రైతు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. 6-4-1943 నుండి 9 మాసాల శిక్ష రు. 50/-

జరిమానా విధించారు. అలీపురం జైలులో శిక్ష అనుభవించారు.

## 51. సూరపనేని ప్రభాకరరావు



తండ్రి పద్మనాభం. చింటమర్రిలో జననం. విద్యార్థిగా వుండగా ఉప్పసత్యాగ్రహంలో పాల్గొన్నారు. 17-6-1930 నుండి 21 మాసములు శిక్ష విధింపబడింది. రాజమండ్రి, తిరుచునాపల్లి జైళ్లలో శిక్ష అనుభవించారు. కల్లు దుకాణాల వద్దపికెటింగ్ జరుపుతుండగా గుడివాడలో లాఠీఛార్జికి గురయ్యారు.

## 52.ఎస్. దశరథరామయ్య

తండ్రి అంజయ్య. జన్మస్థలం గుడివాడ తాలూకా అంగలూరు. వ్యాపారి. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. 6-4-1943న సంవత్సరం కఠిన శిక్ష 10 కొరడా దెబ్బల శిక్ష విధించారు. అలీపురం జైలులో శిక్ష అనుభవించారు. అనారోగ్య కారణాలపై కొరడా దెబ్బల శిక్షను అమలు జరపలేదు. 2-10-1943న ప్రభుత్వం విడుదల చేసింది.

## 53. కోసరాజు సత్యనారాయణ



తండ్రి బావయ్య. జననం 1906 గుడివాడ తాలూకా అంగలూరు. రైతు. ప్రస్తుత నివాసం విజయవాడ తాలూకా ఎనికేపాడు. ఉప్ప సత్యాగ్రహంలో పాల్గొని, 2-7-1930 నుంచి ఆరు నెలల కఠినశిక్షను రాజమండ్రి, తిరుచునాపల్లి,

అలీపురం జైళ్లలో అనుభవించారు. అంగలూరులో జాతీయజెండా ఎగురవేయగా, 11-2-1931న ఆరు మాసాల కఠినశిక్ష విధించారు. గాంధీజీ-ఇర్విన్ ఒప్పందంతో 11-3-1931 న రాజమండ్రి జైలునుంచి విడుదలయ్యారు. 1932 జనవరి 26న స్వాతంత్ర్య దినోత్సవం జరిపి, లాఠీఛార్జికి గురయ్యారు.

## 54. ఆరెకపూడి కోటయ్య

తండ్రి రామస్వామి జన్మస్థలం గుడివాడ తాలూకాఅంగలూరు. రైతు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని, 1-5-1930 నుంచి ఆరునెలల కఠిన శిక్షను రాజమండ్రి, కడలూరు జైళ్లలో అనుభవించారు.

## 55. దుగ్గిరాల వెంకటేశ్వరరావు

తండ్రి శివయ్య. అంగలూరు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నందుకు గుడివాడ సబ్‌జైలులో శిక్షననుభవించారు.

## 56. బొప్పన రామప్రసాదరావు

తండ్రి శేషయ్యఅంగలూరు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నందుకు గుడివాడ సబ్‌జైలులో శిక్షననుభవించారు.

## 57. గొట్టిపాటి వీరరాఘవయ్య

తండ్రి సుబ్బయ్య. అంగలూరు. వీరుకూడా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నందుకు గుడివాడ సబ్‌జైలులో శిక్షననుభవించారు.

# ముగింపులు

జాతీయోద్యమంలో ఆనాడు విజయవాడలో అయ్యదేవర కాళేశ్వరరావు పంతులుగారు, బందరులో కాశీనాధుని పూర్ణమల్లికార్జునుడుగారు, వేదశ్రీగారు అంగలూరులో ఆరెకపూడి నాగభూషణం, బౌద్ధ వాఙ్మయ బ్రహ్మ దుగ్గిరాల బలరామకృష్ణయ్య, సాధు సుబ్రహ్మణ్యంలు గొల్వేపల్లిలో వల్లభనేని రామబ్రహ్మం, భట్లపెనుమర్రులో పింగళి వెంకయ్యగారు, అన్నింటికి అందరికీ మించి మేరు నగధీరుడు విశ్వదాత దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులుగారు, ఆకునూరు నుండి కాతాని వెంకట రత్నంగారు యింకా చరిత్ర కందని జాతిరత్నా లెన్నో తమ అమూల్యమైన ధన, మాన ప్రాణాల్నర్పించి కవోష్ణ రక్తం చిందించి జాతికి స్ఫూర్తిదాతలై కీర్తిని మూటగట్టుకొన్నారు.

జాతీయోద్యమానికి బందరు మొదటి దైతే రెండవది 'అంగలూరు' అని కాశీనాధుని వారిమాట. ఆనాడు జాతిని జాగృతం చేయడానికి యీనాటితరానికి ఆదీప్తిని అందజేయడానికి వారధుల వంటివారి శతవసంత జీవితులు.

నిస్వార్థంగా, నిరాడంబరంగా, నిష్కళంకంగా దేశానికి సేవలందించిన యీ మనీషి ఏపదవినీ ఆశించక 'తనపని పూర్తియైందన్న' భావనతో నిష్కామ యోగిగా అంగలూరులో తమ జీవన సంధ్యాకాలాన్ని తరలించుచున్నారు.

ఈనాడైనా వారినుంచి స్ఫూర్తిని పొంది నిస్వార్థత, నిష్కళంకత మనం అబ్బించుకోనకుంటే ఒకనాడు అంగలూరంటే ఉన్నకీర్తి ప్రతిష్ఠలు అడుగంటి జాతిజీవనంలో ఉన్నతినందిన మనం నతిని చూడక తప్పదు.

వారు నిన్నటితరానికి ప్రతినిధులు నేటి తరానికి పెన్నిధులుగదామరి. జ్ఞాన వయోవృద్ధులై మనకళ్ళెదుటినున్న విద్యా వివేక వినయసంపన్నుని, ప్రజలకోసం దేశంకోసం తమ సుఖ సంతోషాలను త్యజించిన యిట్టి త్యాగధనులను సన్మానించుకోవడం నిజంగా మనని మనం సన్మానించుకోవడమే అవుతుంది.

ఇలా సన్మానించడం మన అదృష్టమే అవుతుంది.

వారినుంచి ఏంస్ఫూర్తిని పొందురాంమరి? మతాల మత్తును వీడదాం! కులాల కుమ్ములాటలను వదులుదాం. నోటుకు ఓటు నమ్ముకోడం మానుకుందాం. ' స్వాతంత్ర్యం నాజన్మహక్కు ' యీదేశంపై నాకే హక్కు అని యెరిగి వారందించిన స్వరాజ్యాన్ని సురాజ్యం గా మలచుకొందాం.

" స్వాతంత్ర్య మే నాజన్మహక్కని చాటండీ " " నిరంకుశం బౌ శక్తులెదరినా నిర్భయముగనెదురించడీ " అన్న తిలకుని మాటలు ఆజాద్ హింద్‌ఫౌజ్‌లా "జై హింద్" అన్న నేతాజీమాట లను నిజంచేద్దాం. గతాన్ని స్మరించి, వర్తమానాన్ని దిద్దుకొని ఉజ్వల భవిష్యత్తులోనికి పయనిద్దాం. ఉంటామరి! సెలవ్ !

ఇట్లు,

**మీ దుగ్గిరాల శ్రీశైలమల్లిఖార్జునరావు**

" జైహింద్ "

# కృతజ్ఞతలు



డా॥ శ్రీ ఆరెకపూడి ప్రేమ్‌చంద్‌బాపు U.S.A.

ఈ చిన్ని చరిత్ర పొత్తాన్ని రూపొందించేందుకు
ప్రోత్సహించి ఆర్థిక సహకారమందించిన
డా॥ శ్రీఆరెకపూడి ప్రేమచంద్ బాపూ U.S.A. గారికి
సన్మాన సంఘంతరపున కృతజ్ఞతలు.

శ్రీ యుతులు Dr. ఆరెకపూడి ప్రేమచంద్‌బాపూ, M.D.,U.S.A., చికాగో మరయు గొంది విజయలక్ష్మి , U.S.A. గార్లు సన్మాన సంఘమువారి కోరికను మన్నించి, " అంగలూరు స్వాతంత్ర్యసమర యోధుల చరిత్ర " పొత్తాన్ని రూపొందించేందుకు, స్వాతంత్ర్యసమర యోధుల చౌక్ నిర్మాణానికి, యీసన్మాన కార్యక్రమానికి తమవంతు సహకారంగా ఐదువందల U.S.A. డాలర్లు సహాయమందించి నందులకు శ్రీ ఆరెకపూడి నాగభూషణం సన్మానసంఘమువారు హర్షామోదాలతో కృతజ్ఞతలు తెలుపుచున్నారు.

అట్లే Dr. B.S.Rao (చైతన్య విద్యా సంస్థలు, విజయవాడ) వారి సోదరుడు రాజేంద్రగారు అందజేసిన రూ. 15,000/- ఆర్థిక సహాయానికి కూడా శ్రీ ఆరెకపూడి నాగభూషణం శతజయంతి సన్మానసంఘమువారు కృతజ్ఞతలు తెలియజేయుచున్నారు.

ఇట్లు

**స్వాతంత్ర్య సమరయోధులు**

**శ్రీ ఆరెకపూడి నాగభూషణం శతజయంతి సన్మాన సంఘము,**

**అంగలూరు.**

✆ : 43047, 47782.
కమలా ఆఫ్‌సెట్ ప్రింటర్స్,
(కిషోర్ D.T.P. క్రియేషన్స్)
బాలాజి థియేటర్ దగ్గర,
గుడివాడ - 521301.